# అప్పుల నుంచి అభివృద్ధి వైపు..



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ చెప్పిన అడుగుజాడల్లోనే నడుస్తూ తమ పాలన సాగిస్తున్నామని.. తాము పాలకులం కాదు, ప్రజలకు సేవకులం అని డిప్యూటీ సీఎం భట్టి విక్ర మార్క అన్నారు. శుక్రవారం ఆయన శాసనసభలో బడ్జెట్ 202627 ప్రవేశపెట్టారు. ప్రజలు తమకు అప్పగించిన ఈ అధికారాన్ని ఒక బాధ్యతగా భావించి, ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్రాన్ని ప్రగతి పథంలో తీసుకుపోతున్నామన్నారు. గత ప్రభుత్వం చేసిన ఆర్థిక, వ్యవస్థల విధ్వంసాన్ని సరిచేస్తూ, పాత అప్పులను, వాటి వడ్డీలను కట్టుకుంటూనే పాలనను గాడిలో పెట్టామని వెల్లడించారు. అభివృద్ధిలో రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలబెట్టాలన్నదే తమ లక్ష్యమని.. అందుకోసమే అహర్నిశలు శ్రమిస్తున్నామని చెప్పారు. ఈ రెండేళ్లలోనే రాష్ట్రానికి రికార్డు స్థాయిలో పెట్టుబడులు తీసుకురాగలిగామని తెలిపారు. బడ్జెట్ అంటే సంఖ్యల చుట్టూ తిరిగే అంకెలు కాదని.. ప్రజల చుట్టూ తిరిగే సంఖ్యలు అని.. బడ్జెట్ ప్రజల జీవన స్థితి గతులు మార్పునకు దోహదపడే లెక్కలు అని వెల్లడించారు. రాష్ట్ర ప్రజల ఆశలు, ఆశయాలను నిజం చేసే సంకల్ప పత్రమే ఈ బడ్జెట్ అని చెప్పారు.

### రాష్ట్ర జీఎస్‌డీపీ రూ.17,82,198 కోట్లు..

202526 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ) ప్రస్తుత ధరల ప్రకారం రూ.17 లక్షల 82 వేల 198 కోట్లు అని భట్టి వెల్లడించారు. గతేడాదితో పోలిస్తే వృద్ధి రేటు 10.7 శాతంగా నమోదైందన్నారు. ఇదే సమయంలో దేశ జీడీపీ రూ.3 కోట్ల 57 లక్షల 13 వేల 886 కోట్ల కాగా, వృద్ధి రేటు 8 శాతంగా ఉన్నదని.. తెలంగాణ వృద్ధి రేటు దేశ సగటు వృద్ధి రేటు కంటే 2.7 శాతం ఎక్కువగా ఉన్నదని చెప్పారు. అదే విధంగా దేశ జీడీపీలో రాష్ట్ర జీఎస్‌డీపీ 5శాతం వాటా కలిగి దేశానికి ఒక బలమైన గ్రోత్ ఇంజిన్‌గా తెలంగాణ నిలుస్తున్నదని తెలిపారు. దేశ వృద్ధి రేటు తగ్గుతూ మందగమనంలో ఉన్నప్పటికీ, రాష్ట్ర వృద్ధిరేటులో మెరుగైన పెరుగుదల కనిపిస్తుందని చెప్పారు. అలాగే.. రాష్ట్ర తలసరి ఆదాయం గణనీయంగా పెరిగిందని తెలిపారు. 202526 ఆర్థిక సంవత్సరంలో ప్రస్తుత ధరల ప్రకారం రాష్ట్ర తలసరి ఆదాయం రూ. 4 లక్షల 18వేల 931 కాగా, వృద్ధి రేటు 10.2 శాతం అని.. దేశ తలసరి ఆదాయం రూ. 2 లక్షల 19 వేల 575 కాగా.. వృద్ధి రేటు కేవలం 6.9 శాతం అని తెలిపారు. దేశ తలసరి ఆదాయంతో పోల్చితే తెలంగాణ తలసరి ఆదాయం రూ.1,99,356 ఎక్కువ అని.. అంటే 1.9 రెట్లు అధికం అని వెల్లడించారు.

### 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ..

ప్రస్తుతం 200 బిలియన్ యూఎస్ డాలర్లుగా ఉన్న ఆర్థిక వ్యవస్థను 2034 నాటికి 1 ట్రిలియన్ యూఎస్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ యూఎస్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే ఒక మహత్తర లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని భట్టి చెప్పారు. ఈ లక్ష్యాన్ని సాధించడం కోసం విభాగాల వారీగా ప్రత్యేక ప్రణాళికలను రూపొందిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కో ఆపరేటివ్ ఫెడరలిజం స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వంతో సత్సంబంధాలు కొనసాగిస్తున్నామని చెప్పారు. 202122 సంవత్సరంలో రాష్ట్రానికి కేంద్ర ప్రాయోజిత పథకాల ద్వారా రూ.4,826 కోట్లు వచ్చాయని.. తమ ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరం ఇప్పటిదాకా 7,072 కోట్ల రూపాయలను సాధించిందన్నారు. ఇదే ఒరవడిని కొనసాగిస్తూ, మరిన్ని నిధులను సాధించడానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రయత్నిస్తోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో పరిమితులకు మించి చేసిన అప్పుల కారణంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై తీవ్ర భారం పడిందని.. ఈ తప్పిదాన్ని సరిదిద్దేందుకు, గత ప్రభుత్వం అధిక వడ్డీకి తెచ్చిన రూ.25,612 కోట్ల రుణాలను తక్కువ వడ్డీకి పునర్వ్యవస్థీకరించి ఉందన్నారు. అంతేకాకుండా, రుణ చెల్లింపుల వ్యవధిని పెంచి, అసలు చెల్లించాల్సిన కాలాన్ని 20 39 సంవత్సరాలకు పొడిగించిందని.. ఈ రుణ పునర్వ్యవస్థీకరణ ద్వారా 202526 నుంచి 2031 32 దాకా చెల్లించాల్సిన రూ.34,058 కోట్ల నుంచి 11,915 కోట్లకు తగ్గిందని తెలిపారు. దీని ద్వారా రాష్ట్రానికి రూ.22,142 కోట్ల క్యాష్ అవుట్ ఫ్లో తగ్గి నగదు వెసులుబాటు కలిగిందన్నారు.

### రూపాయికి వచ్చేది 42 పైసలే..

కేంద్రానికి పన్నుల రూపంలో ఏటా వేల కోట్ల రూపాయల ఆదాయం సమకూరుస్తుంటే... తిరిగి కేంద్రం పన్నుల పంపకాల ద్వారా మనకు ఇస్తున్నది మనం కట్టే ప్రతి రూపాయిలో సగటున 42 పైసలేనని డిప్యూటీ సీఎం తెలిపారు. జనాభా నియంత్రణ పాటిస్తూ, సొంత రాబడి పెంచుకుంటూ, దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్న రాష్ట్రాలకు ఈ పంపకం ద్వారా తీవ్ర అన్యాయం జరుగుతూ వస్తుందన్నారు. 16వ ఆర్థిక సంఘం ముందు బలమైన వాదనను వినిపించి తెలంగాణ వాటాను 2.102 శాతం నుంచి 2.174 శాతానికి పెంచడం జరిగిందన్నారు. అలాగే.. క్యూర్, రేర్, ప్యూర్ అనే మూడు ప్రాంతాల ఆధారంగా సమతుల్య, సుస్థిర అభివృద్ధి సాధించడానికి రాష్ట్ర దీర్ఘకాలిక అభివృద్ధి వ్యూహాన్ని ప్రతిపాదించిందని చెప్పారు. దావోస్‌లో ఆవిష్కరించిన నెక్స్ట్ జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026 2030 ద్వారా ఈ రంగంలో ఇప్పటిదాకా రూ.73,360 కోట్ల పెట్టుబడులను ఆకర్షించామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి దార్శనిక నాయకత్వంలో 30 వేల ఎకరాలలో భారత్ ఫ్యూచర్ సిటీ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

### నిరుద్యోగులకు 67,763 ఉద్యోగాలు..

గత ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడిందని, టీజీపీఎస్సీ ద్వారా నిర్వహించే అత్యున్నతమైన గ్రూప్ 1, గ్రూప్ 2 పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించలేక, పరీక్షా పత్రాలు లీక్ కావడంతో రాజ్యాంగ బద్ధ సంస్థ నవ్వులపాలు అయిందని భట్టి అన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఎందరో నిరుద్యోగులు ప్రాణాలు కోల్పోయారని.. ఈ ప్రభుత్వం అధికారంలోకి రాగానే యూపీఎస్సీ స్థాయిలో టీజీపీఎస్సీని పునర్ వ్యవస్థీకరించి, నిరుద్యోగుల ఆకాంక్షలను గుర్తించి, ఇప్పటివరకు 67,763 మంది నిరుద్యోగులకు నియామక పత్రాలు అందించడం జరిగిందన్నారు. సామాజిక అంతరాలతో సంబంధం లేకుండా పేద, మధ్యతరగతి, ధనిక అని తేడా చూడకుండా రాష్ట్రంలోని కోటి 15 లక్షల కుటుంబాలకు ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల రూపాయల జీవిత బీమా అందించే విధంగా జూన్, 02, 2026 నుండి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని నూతనంగా ప్రవేశపెడ్తున్నామన్నారు. భూభారతి ద్వారా ఈ ఏడాది 3 లక్షల 76 వేల కొత్త పట్టాదారు పాస్ బుక్స్ జారీ చేయబడ్డాయన్నారు. రూ.12,600 కోట్లతో ఇందిరా సౌర గిరి జల వికాసం పథకం ద్వారా 100 శాతం సబ్సిడీతో సోలార్ పంపు సెట్లను అందించి, వారి పురోగతికి ఇతోధికంగా తోడ్పడతామన్నారు. రైతు సంక్షేమమే ప్రథమ ప్రాధాన్యతగా తాము భావిస్తున్నామని అందుకే ఈ బడ్జెట్‌లో వ్యవసాయానికి, రైతు సంక్షేమానికి రూ.23,179 కోట్లు ప్రతిపాదిస్తున్న ట్లు చెప్పారు. మార్చి 13, 2026 తెలంగాణ విద్యుత్ రంగానికి చరిత్రాత్మక రోజు అని.. ఆ రోజు 18,228 మెగావాట్ల గరిష్ట డిమాండ్‌ను సమర్థవంతంగా నెరవేర్చడమే కాకుండా 341.08 మిలియన్ యూనిట్ల విద్యుత్ సరఫరా చేసి రాష్ట్ర చరిత్రలోనే అత్యధిక వినియోగాన్ని నమోదు చేశామన్నారు. ఇది తెలంగాణ అభివృద్ధి వేగాన్ని స్పష్టంగా చూపించే సూచిక అని అన్నారు. నాణ్యమైన, నైపుణ్యం కలిగిన విద్యను అందించాలనే సంకల్పంతో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను మంజూరు చేయాలని నిర్ణయించామన్నారు. ప్రాథమిక విద్యను బలోపేతం చేయడానికి 33 జిల్లాల్లో 1,362 ప్రీప్రైమరీ విభాగాలను పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించామని.. రాబోయే విద్యా సంవత్సరంలో ఈ కార్యక్రమాన్ని 2,000 నుంచి 2,500 ప్రభుత్వ పాఠశాలలకు విస్తరించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని తెలిపారు. బాలికల విద్యను ప్రోత్సహించేందుకు 2025-26 విద్యా సంవత్సరంలో 93 కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలను యంగ్ ఇండియా ఇన్స్టిట్యూట్స్ఆఫ్ ఎక్సలెన్స్‌గా ప్రకటించామన్నారు.

### విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ పథకం

2026-27 విద్యా సంవత్సరం నుంచి ప్రీప్రైమరీ నుండి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన పోషకాలతో రాష్ట్రంలో నూతనంగా బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని భట్టి తెలిపారు. ఈ బ్రేక్‌ఫాస్ట్‌లో ప్రతి విద్యార్థికి వారానికి మూడు రోజులు అల్పాహారంతోపాటు పాలు, మిగతా మూడు రోజులు రాగి జావ అందిస్తామన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ అభ్యసిస్తున్న విద్యార్థులకు ఇకపై నూతనంగా మధ్యాహ్న భోజన పథకాన్ని విస్తరిస్తున్నామని తెలిపారు. ఇంటర్మీడియట్ విద్య చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు రెట్రో ఫిట్టెడ్ మోటరైజ్డ్ వాహనాలను పంపిణీ చేయాలని నిర్ణయించామని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని వసతి గృహాలు, గురుకుల విద్యా సంస్థల్లోని వంటశాలల ఆధునీకరణకు 100 కోట్ల రూపాయలు ప్రతిపాదించామన్నారు. నైపుణ్యాలకు సంబంధించిన అన్ని సంస్థలను ఒకే గొడుగు కిందకు తీసుకురావడానికి, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు, పాలిటెక్నిక్ కళాశాలలు, టామ్‌కామ్‌లను ఈ స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకువస్తామని.. యువతను బ్లూ కాలర్ ఉద్యోగాల కోసం సన్నద్ధం చేసేలా.. ఉస్మానియా యూనివర్సిటీ, జేఎన్‌టీయూ తదితర విద్యాసంస్థల తరహాలో ఈ విశ్వవిద్యాలయాన్ని తయారు చేయటం తమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రజలందరి హెల్త్ ప్రొఫైల్‌ని సిద్ధం చేసి, వారికి డిజిటల్ హెల్త్ కార్డులు అందజేస్తామని తెలిపారు. నూతనంగా 17 మెడికల్ కాలేజీల నిర్మాణం చేపడుతున్నామని.. మెడికల్ విద్యను విస్తరించేందుకు కొత్తగా 9 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, 16 నర్సింగ్ కాలేజీలు, 28 పారా మెడికల్ కాలేజీలు ప్రారంభించబడ్డాయన్నారు. ఉద్యోగుల భద్రత కోసం దేశంలోనే తొలిసారిగా సమగ్ర ప్రమాద బీమా పథకాన్ని ప్రవేశపెట్టామని.. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ప్రమాదవశాత్తు మరణిస్తే కోటి 20 లక్షల రూపాయల ప్రమాద బీమా వర్తిస్తుందని.. 60 ఏండ్ల వరకు 10 లక్షల రూపాయల టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్, విమాన ప్రమాదంలో మరణిస్తే 2 కోట్ల రూపాయల అదనపు కవరేజీ లభించే విధంగా ఈ పథకాన్ని రూపకల్పన చేశామని వెల్లడించారు. ఈ పథకం 7 లక్షల 57 వేల ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు వర్తిస్తుందని చెప్పారు. హైదరాబాద్ లోయర్ ట్యాంక్ బండ్ వద్ద కొత్తగా డా.బి.ఆర్.అంబేద్కర్ నాలెడ్జ్ టవర్‌ను నిర్మిస్తున్నామని.. అదేవిధంగా, నింబోలి అడ్డ కాచిగూడలో బాబూ జగ్జీవన్ రామ్ పేరుతో నూతన వసతి గృహాన్ని నిర్మిస్తామని తెలిపారు. హైదరాబాద్ మహానగర ప్రాంతానికి ఔటర్ రింగ్ రోడ్ వరకు తాగునీరు, మురుగునీటి సేవలను, హైదరాబాద్ మహానగర వాటర్ బోర్డు అందిస్తున్నదని.. గోదావరి తాగునీటి ప్రాజెక్టు, కొత్త రిజర్వాయర్లు, 39 మురుగునీటి శుద్ధి కేంద్రాలను మంజూరు చేశామని, వాటి నిర్మాణం వివిధ దశలలో కొనసాగుతుందన్నారు.

### నక్సలిజం.. పునరావాసం..

నక్సలిజాన్ని గత ప్రభుత్వం, ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం కేవలం శాంతిభద్రతల సమస్యగానే పరిగణించి, పోలీసు, సైనిక బలగాలతో అణచివేసే ప్రయత్నం చేశాయని.. కానీ, తమ ప్రభుత్వం ఈ సమస్య మూలాలను విశ్లేషించి యువతకు సరైన జీవనోపాధి, సామాజిక గౌరవం, ఆర్థిక భరోసా కల్పిస్తే అడవుల్లోకి వెళ్లిన వారు ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో కలుస్తారనే సామాజికఆర్థిక వాస్తవాన్ని గుర్తించిందని భట్టి తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత 20142023 వరకు 347 మంది మావోయిస్టులు లొంగిపోగా.. తమ ప్రభుత్వం ఏర్పడిన 2023 డిసెంబర్ 7 నుంచి 2026 మార్చి 8 వరకు 732 మంది వివిధ స్థాయి క్యాడర్ మావోయిస్టులు లొంగిపోయారన్నారు. చరిత్రలో మొదటిసారిగా హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ పోటీలు నిర్వహించడంతో ప్రపంచం దృష్టిని హైదరాబాద్ ఆకర్షించిందని తెలిపారు. ఒక్క మాటలో చెప్పాలంటే తాను ప్రతిపాదిస్తున్న ఈ బడ్జెట్ తెలంగాణ ప్రజల ఆశా దీపం అని అన్నారు. అభివృద్ధికి, సంక్షేమానికి పెద్దపీట వేసి ఆర్భాటాలకు పోకుండా ఆర్థిక క్రమశిక్షణకు ప్రాధాన్యతనిచ్చామని తెలిపారు.

### నాలుగో సారి బడ్జెట్ ప్రవేశపెట్టిన భట్టి..

తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క 202627 ఆర్థిక సంవత్సరానికి గాను రూ. 3.24 లక్షల కోట్ల భారీ బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఇది ఆయన వరుసగా (కాంగ్రెస్ ప్రభుత్వంలో) ప్రవేశపెట్టిన నాల్గవ బడ్జెట్ కాగా, ఇందులో ఇందిరమ్మ ఇళ్లు, సాగునీరు, విద్య, గ్రామీణాభివృద్ధికి, సంక్షేమానికి పెద్దపీట వేశారు. అంతకుముందు ప్రజాభవన్‌లోని నల్ల పోచమ్మ ఆలయంలోని అమ్మవారి వద్ద బడ్జెట్ ప్రతులను పెట్టి భట్టి పూజలు నిర్వహించారు.

### రెండు గంటలపాటు బడ్జెట్ ప్రసంగం..

202627 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క రూ.3,24,234 కోట్లతో బడ్జెట్‌ను ప్రతిపాదించారు. మధ్యాహ్నం 12.04 గంటలకు ప్రారంభమైన భట్టి బడ్జెట్ ప్రసంగం మధ్యాహ్నం 1.55 నిమిషాల వరకు కొనసాగింది. అంటే సుమారు రెండు గంటలపాటు బడ్జెట్ ప్రసంగాన్ని చదివి వినిపించారు. కాగా.. బడ్జెట్ ప్రసంగం ముగిసిన వెంటనే భట్టిని సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. ప్రభుత్వ విప్‌లు, మంత్రులు, ఎమ్మెల్యేలు భట్టిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కాగా.. ''ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం అందించడమే పరిపాలన లక్ష్యం'' అంటూ అంబేద్కర్ చెప్పిన మాటలతో బడ్జెట్ ప్రసంగాన్ని ప్రారంభించడం విశేషం.



## సాహిత్యం సమాజ చైతన్యానికి ఆయుధం

- గుజ్జ సత్యం

**విశ్వంభర, భూదాన్ పోచంపల్లి :** త్రివేణి సాహితీ సంఘం, కెవిటి స్పోర్ట్స్ క్లబ్, కల్పన ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉగాది సందర్భంగా 40వ ఉగాది కవి సమ్మేళనం భూదాన్ పోచంపల్లి లోని మార్కండేశ్వర స్వామి దేవాలయ ఆవరణలో సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పోచంపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ తడక వెంకటేశ్వర్లు , జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం, ప్రొఫెసర్ తూర్పు మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.ఈ సందర్భంగా గుజ్జ సత్యం మాట్లాడుతూ సాహిత్యం సమాజానికి అద్దం పట్టడమే కాకుండా సమాజ మార్పుకు మార్గదర్శకంగా నిలుస్తుందని అన్నారు. కవిత్వం కేవలం భావ వ్యక్తీకరణ మాత్రమే కాకుండా సామాజిక చైతన్యానికి ఆయుధమని పేర్కొన్నారు. సమాజంలో సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, వెనుకబడిన వర్గాల అభివృద్ధి వంటి అంశాలను కవులు తమ రచనల ద్వారా ప్రజల్లో చైతన్యం కలిగించాలని పిలుపునిచ్చారు. తెలుగు భాషా సంస్కృతిని పరిరక్షించడంలో కవి సమ్మేళనాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో తడక యాదగిరి, పట్నం కృష్ణకుమార్, సీత సత్యనారాయణ, భారత లవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉగాది వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్



**విశ్వంభర, హైదర్ నగర్ :** హైదర్ నగర్ డివిజన్ పరిధిలో పబ్లిక్ పార్కులో కాలనీవాసులు పరాభవ నామ సంవత్సరం ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హైదర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు పాల్గొన్నారు. కాలనీవాసులు కార్పొరేటర్ ని సన్మానించి ఉగాది పచ్చడి అందించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ, నియోజకవర్గ, రాష్ట్ర ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలుపుతూ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో అనుకున్న పనులన్నీ నెరవేరాలని ఆ భగవంతుని మనస్ఫూర్తిగా వేడుకుంటున్నానని తెలిపారు.

## ఐఎన్ టీఏసిహెచ్ ఎన్నికల్లో వేదకుమార్ గెలుపు



**విశ్వంభర, హిమాయత్ నగర్ :** ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ (కళ) హ్యాండ్ కల్చరల్ హెరిటేజ్ (సాంస్కృతిక ) వారసత్వం ఐఎన్ టీఏసిహెచ్ (డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్) న్యూఢిల్లీ గవర్నింగ్ ఎన్నికలలో రికార్డు స్థాయిలో 4వ సారి ఇంజనీర్ వేద కుమార్ తిరిగి ఎన్నికయ్యారు. ఆయన తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ ఇండియా స్మారక చిహ్నాలు చారిత్రక భవనాలు సాంస్కృతిక సహజ వారసత్వ ప్రదేశాల గుర్తింపు. సంరక్షణ, పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తున్నారు. ఆయన అనేక దేశాలను సందర్శించి చారిత్రక నగరాలు ప్రదేశాలు అధ్యాయనం చేశారు. అంతర్జాతీయ వారసత్వ సదస్సులు ఎన్నో వేడుకల్లో పాల్గొని భారతదేశం యొక్క వైవిధ్యభరితమైన సంస్కృతిక వారసత్వాన్ని ప్రపంచానికి తెలియజేశారు. తెలంగాణ ప్రభుత్వం _ హెరిటేజ్ విభాగంతో కలిసి ముడుమల మెగా లిథిక్ మొన్హైర్స్ ను యునెస్కో ప్రపంచ వారసత్వ తాత్కాలిక జాబితా లో చేర్చడంలో కీలక పాత్ర పోషించారు. ఈ చర్య ద్వారా ఆ ప్రాచీన వారసత్వ స్థలానికి అంతర్జాతీయ గుర్తింపు లభించింది.

## బాధిత కుటుంబానికి రూ.50 వేలు ఆర్థిక సహాయం



**విశ్వంభర, గుండాల :** యాదాద్రి జిల్లా గుండాల మండలంలోని రామవరం గ్రామం లో గుజ్జ మాధవి రేషన్ డీలర్ భర్త గుజ్జ దశరథ మృతిచెందడంతో వారి కుటుంబానికి యాదాద్రి జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం 50వేల రూపాయల ఆర్థిక సహాయం అందేజేసింది.. ఈ కార్యక్రమంలో యాదాద్రి జిల్లా అధ్యక్షులు వెలగల రాజన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి కొయ్యలగూడెం వెంకటేశం, ఉపాధ్యక్షులు సుర్వి వెంకటేష్ గౌడ్, జిల్లా కోశాధికారి ఎడ్ల దర్శన్ రెడ్డి, మోత్కూర్ ఐఎంజి అధ్యక్షులు సైదులు, భువనగిరి మండల అధ్యక్షులు మహేష్ , గుండాల అధ్యక్షులు హరి కిషన్ , ఉపాధ్యక్షులు అంజయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు రాపోలు సరస్వతి అశోక్, సువర్ణ నర్సిరెడ్డి , మోత్కూర్ ప్రధాన కార్యదర్శి సునిత శ్రీనివాస్, ఆలేరు మండల అధ్యక్షులు దూడల రోశయ్య, నరసింహ, రేషన్ డీలర్లు స్వామి, పురుషోత్తం, నాగేష్ వివిధ రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

## మహేశ్వరంలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం





**విశ్వంభర, మహేశ్వరం :** మహేశ్వరం మండల కేంద్రంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి శైలజ రెడ్డి తెలంగాణ ప్రభుత్వ ప్రజా పాలన 99 రోజుల ప్రణాళిక లో భాగంగా ఇందిరమ్మ ఇల్లు నూతన గృహప్రవేశాలు చేశారు. ఇందిరమ్మ ఇల్లు వచ్చిన అభ్యర్థులు మాట్లాడుతూ, నిరుపేదలైన మమ్మల్ని గుర్తించి ఇందిరమ్మ ఇల్లు ఇచ్చినందుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డికి, నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం మండల గృహనిర్మాణ ఏఈ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ ఏఈ చైతన్య,మహేశ్వరం గ్రామపంచాయతీ కార్యదర్శి సుజాత, గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్, తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాకి ఈశ్వర్ ముదిరాజ్, శివగంగ ఆలయ కమిటీ చైర్మన్ అల్లె కుమార్, మహేశ్వరం గ్రామ ఇందిరమ్మ కమిటీ సభ్యులు స్వర్ణగంటి సుభాష్, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం పట్టణ శాఖ అధ్యక్షులు బంగారుగళ్ల లాజర్, కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ మహేశ్వరం నియోజకవర్గ అధ్యక్షులు గదగూటి హరికృష్ణ ముదిరాజ్, మహేశ్వరం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ మండల అధ్యక్షులు షేక్ హాజీ బాబా, గ్రామపంచాయతీ వార్డ్ మెంబర్స్ కాకి పరమేష్ ముదిరాజ్, స్వర్ణ గంటి సంజీవ, కడెమోని ప్రభాకర్, ఆకుల వీరు బాబు, ఆవుల కాడి శ్రీశైలం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పుట్లగారి చందు, గ్రామ యువకులు బొమ్మనమైన మహేష్ బాబు, గ్రామపంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ రాజు నాయక్, సిబ్బంది దానప్ప గారి లక్ష్మణ్. పేయ్యాల కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఇది ఫేక్, రివిజన్, ప్యాబ్రికేటెడ్ బడ్జెట్



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** కాంగ్రెస్ ప్రభుత్వం ఫేక్, రివిజన్, ప్యాబ్రికేటెడ్ బడ్జెట్ ప్రవేశపెట్టిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. బీసీలు, మహిళలు, నిరుద్యోగులు, రైతులు, వికలాంగులు, మైనార్టీల ఇలా అన్ని వర్గాలకు బడ్జెట్‌లో అన్యాయం చేశారని అన్నారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో శుక్రవారం మీడియాతో మాట్లాడారు. రైతుభరోసా, చేయూత పింఛన్లు సహా చాలా రంగాలకు గతేడాది కేటాయించిన నిధులనే అక్షరం మార్చకుండా కొత్త బడ్జెట్‌లోనూ పెట్టారని తెలిపారు. ఈ ప్రభుత్వానికి కనీస విజన్ కూడా లేదని అందుకే ఇది రివిజన్ బడ్జెట్ అంటున్నామని మండిపడ్డారు. ఏటా బీసీలకు రూ.20 వేల కోట్లు కేటాయిస్తామంటూ రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఫేకారని.. కానీ, బడ్జెట్‌లో మాత్రం 4 శాతం నిధులే కేటాయించి మోసం చేశారన్నారు. లక్షల కోట్లు అప్పులు తెస్తున్న రేవంత్ సర్కార్ ఆ డబ్బులను ఏం చేస్తున్నదని ప్రశ్నించారు. దాదాపు 8 లక్షల 64 వేల కోట్లు అప్పు చేసి ఒక్కో కుటుంబంపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రూ.9 లక్షల అప్పుల భారం మోపిందన్నారు. ప్రజలకు మేలు చేయటం చేతకాని కాంగ్రెస్ నాయకులు ఒకరిని మించి ఒకరు ఫేక్‌తున్నారని మండిపడ్డారు. అందుకే ఇది ఫేక్, ఫేకర్, ఫేకెస్ట్ ప్రభుత్వమని విమర్శించారు.

ఎన్నికల సమయంలో తెలంగాణకు వచ్చి పెద్ద ఎత్తున హామీలిచ్చిన రాహుల్ గాంధీపై కవిత తీవ్ర విమర్శలు చేశారు. ఆయన ఇచ్చిన హామీలన్నీ ఫేకే అన్నారు. అందుకే ఇక నుంచి రాహుల్ గాంధీకి రాహుల్ ఫేక్‌గా నామకరణం చేస్తున్నామన్నారు. సలీం ఫేక్ తన మాటలతో నవ్విస్తే.. రాహుల్‌గాంధీ మాత్రం తెలంగాణ ప్రజలను ఏడిపిస్తున్నారని మండిపడ్డారు. బడ్జెట్‌లో తెలంగాణ ఉద్యమకారులను ఈ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందన్నారు. మహిళలకు రూ.2,500 ఇస్తామన్న స్కీం ఈసారి కూడా పత్తా లేదన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి గతేడాదితో పోల్చితే రూ.7 వేల కోట్లు కోత పెట్టారని అన్నారు. కమీషన్లు వచ్చే యంగ్ ఇండియా స్కూళ్లకు మాత్రం రూ.5 వేల కోట్లు కేటాయించారని ఆరోపించారు.

### కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడం అన్నింటికి మించిన ఫేక్..

కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడం అన్నింటికి మించిన ఫేక్ అన్నారు. తెలంగాణ రైజింగ్ అంటూ సీఎం పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతుంటారని.. కానీ నిరుద్యోగంలో మనం రైజింగ్ అవుతున్నామని చెప్పారు. స్త్రీ నిధి విభాగంలో 14 ఏళ్లుగా జి.విద్యాసాగర్ రెడ్డి అనే వ్యక్తి గత బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాలను మేనేజ్ చేసి ఇప్పటికీ ఉద్యోగంలో కొనసాగుతున్నారన్నారు. అతను చేసే అక్రమాలపై విచారణ కమిషన్ వేసినప్పటికీ ఇప్పటికీ చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. వెంటనే మంత్రి సీతక్క ఎంక్వైరీ చేయించి విద్యాసాగర్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో కేటాయింపులు చేయకున్నా.. రివైజ్డ్ ఎస్టిమేట్స్‌లో అవకాశం దక్కని రంగాలకు ప్రాధాన్యత ఇవ్వచ్చని.. ఆ దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాలని డిమాండ్ చేశారు.



నిజాంపేట్ స్థానిక కాంగ్రెస్ నేత కొలను శ్రీనివాస్ రెడ్డిని 273 డివిజన్ కాంగ్రెస్ నేత, ఏలూరు సత్య కలిసి పరాభవ నామ సంవత్సరం తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేమూరి నాగరాజు, వంశీ, ధర్మతేజ, లక్ష్మిపతి రాజు,సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- విశ్వంభర, నిజాంపేట్